క్లుప్తంగా

ఏఎస్ఐగా కస్తూరి



కస్తూరిని అభినందిస్తున్న ఎస్ఐలు నరేష్, ప్రవీణ్

పాల్వంచ: పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఉమెన్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న 2002 బ్యాచ్‌కు చెందిన కె.కస్తూరి ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎం.నాగరాజు, ఎస్ఐలు కె.నరేష్, జి.ప్రవీణ్‌కుమార్, నాగభిక్షం, పోలీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఐక్యతతోనే సమసమాజ స్థాపన

పాల్వంచ: సమసమాజ స్థాపన కోసం జనాభాలో 85 శాతానికి పైన ఉన్న బహుజను లందరూ ఐక్యం కావాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝెుర్రా కామేష్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో చేరడంతో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

రైతులకు సలహాలివ్వండి

కొత్తగూడెంరూరల్: శిక్షణ పొందిన డీలర్లలకు, రైతులకు సాగులో మేలైన సలహాలు, సూచనలు అందించాలని జిల్లా పరిషత్ వ్యవసాయ స్థాయి సంఘం చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి రైతు వేదికలో జిల్లా ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ డీలర్ల శిక్షణ తరగతుల 7వ బ్యాచ్‌లో ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమానికి పాలకులు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటోందన్నారు. సమావేశంలో వ్యవసాయ అధికారి అభిమన్యుడు, జిల్లా పట్టు పరిశ్రమ అధికారి మరియన్న, కోఆర్డినేటర్ వి.లక్ష్మీనారయణమ్మ పాల్గొన్నారు.

పరామర్శ



నివాళి అర్పిస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి, జెడ్పీ చైర్మన్ కనకయ్య తదితరులు

టేకులపల్లి: కోయగూడెం మాజీ సర్పంచ్ పూనెం సురేందర్ తల్లి పూనెం అమ్మాయమ్మ ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబీకులను బుధవారం పలువురు పరామర్శించారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లాక్యాతండాలో ముప్పారపు రవికుమార్‌రెడ్డి, టేకులపల్లిలో భూక్యా హనుమంతు కుటుంబ సభ్యులను ఇల్లెందు మార్కెట్ చైర్మన్ బానోతు హరిసింగ్‌తో పాటు నాయకులు బానోతు రామ, జాటోతు నరేష్ పరామర్శించారు. ఇంకా ఆయా కుటుంబాలను కాంగ్రెస్ నాయకుడు లక్కినేని సురేందర్‌రావు తదితరులు పరామర్శించారు.


పనులు కొనసాగించాలి



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న డీపీఓ

జూలూరుపాడు: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిరంతరాయంగా కొనసాగించాలని డీపీఓ లక్ష్మీ రమాకాంత్ అన్నారు. బుధవారం వినోభానగర్, వెంగన్నపాలెం, జూలూరుపాడు, పడమటనర్సాపురం, మాచినేనిపేటతండా గ్రామ పంచాయతీలో డీపీఓ పర్యటించారు. పారిశుద్ధ్య పనులు, డంపింగ్ యార్డుల్లో సెగ్రిగ్రేషన్ పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య పనులు, డంపింగ్ యార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధి కూలీలు తగ్గకుండా చూడాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ మధుసూదన్‌రావు

పాల్వంచ: ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో పనులకు 50 మంది కూలీలకు తగ్గకుండా వచ్చేలా చూడాలని డీఆర్‌డీఓ మధుసూదన్‌రావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం వంద రోజులు పూర్తి చేసుకునేలా చూడాలని, కూలీలు కనీసం 6గంటల పాటు పనిచేసి, రూ.257 వేతనం పొందేలా పనిచేయించాలని చెప్పారు.

యాసంగిలో 'తెల్ల బంగారం' సాగు

- 20 ఎకరాల విస్తీర్ణంలో సాగు
- ప్రత్యామ్నాయంగా పత్తి మేలంటున్న రైతులు



వెంగన్నపాలెం గ్రామంలో ఏపుగా పెరిగిన పత్తి మొక్కలు

జూలూరుపాడు: మండలంలోని పలువురు రైతులు యాసంగిలో పత్తి పంట సాగు చేశారు. జూలూరుపాడు, వెంగన్నపాలెం, కాకర్ల, పడమటనర్సాపురం, కరివారిగూడెం, మాచినేనిపేట గ్రామాలకు చెందిన పలువురు రైతులు సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో పత్తి సాగు చేస్తున్నారు. గత ఏడాది జూలూరుపాడు, వెంగన్నపాలెం గ్రామాలకు చెందిన ముగ్గురు రైతులు మాత్రమే 10 ఎకరాల్లో సాగు చేయగా ఈ ఏడాది సాగు విస్తీర్ణం రెట్టింపు అయింది. గత ఏడాది సాగు చేసిన రైతులకు పత్తి పంట ఎకరానికి 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి రావడంతో ఈ ఏడాది యాసంగిలో పత్తి సాగుపై రైతులు మొగ్గు చూపారు. ఈ ఏడాది అధిక వర్షాలు, తుఫాన్‌లు, వాతావరణ పరిస్థితుల ప్రభావంతో వానాకాలంలో సాగు చేసిన పత్తి, మిర్చి పంటలకు తెగుళ్ల సోకి దెబ్బతిన్నాయి. దీంతో పలువురు రైతులు పత్తి, మిర్చి పంటలను తొలిగించి పత్తి సాగు చేస్తున్నారు. వానాకాలంలో పండే పత్తి యాసంగిలో కూడా దిగుబడి వస్తుందని జూలూరుపాడు, వెంగన్నపాలెం రైతులు గత ఏడాది సాగు చేసి నిరూపించారు. ఆ రైతులను స్ఫూర్తిగా తీసుకున్న మరికొంత మంది రైతులు ఈ ఏడాది వేసవి పత్తి సాగుకు శ్రీకారం చుట్టారు. ఎకరానికి రూ.1 లక్ష పెట్టుబడి పెట్టి మిర్చి పంట సాగు చేస్తే వైరస్ సోకి తీవ్రంగా దెబ్బతినగా, అధిక వర్షాలు, వరుస తుఫాన్లతో పత్తి పంట కూడా దెబ్బతిని అప్పుల ఊబీలో కూరకపోయిన రైతులు నష్ట నివారణలో భాగంగా ప్రత్యామ్నాయంగా యాసంగిలో పత్తి పంట సాగును ఎంచుకున్నారు. ఈ ఏడాది పత్తి పంటకు మార్కెట్‌లో మంచి ధర పలుకుతుండటంతో కనీసం ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల పత్తి దిగుబడి రాకపోతుందా? కాలం కలిసి రాకపోతుందా? అనే ఆశతో రైతులు పత్తి సాగు చేస్తున్నారు.



కాకర్ల గ్రామంలో పత్తిలో పాటు చేస్తున్న రైతు

రెండెకరాల్లో పత్తి సాగు చేసిన..



రెండు ఎకరాల కౌలు భూమిలో యాసంగి పత్తి సాగు చేస్తున్నా. ఇప్పటి వరకు పెట్టుబడి రూ.30 వేలు అయ్యాయి. ఈ ఏడాది పత్తికి డిమాండ్ ఉండటంతో యాసంగిలో పత్తి పంట పండుతుందని ఆశతో సాగు చేస్తున్నాం.

– యాటా రాములు, కౌలు రైతు వెంగన్నపాలెం

మిర్చి పంట తొలగించాం..



ఎకరం రూ.40 వేల చొప్పున నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని వానాకాలం మిర్చి పంట వేసినం. తెగుళ్ల సోకి ఎండిపోయింది. మిర్చి తోటను తొలగించి పత్తి, మొక్కజొన్న సాగు చేసినం. పత్తి దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాం.

– కంపసాటి చిన్న కృష్ణయ్య, కౌలు రైతు, కాకర్ల

ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలి



యాసంగిలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి. యాసంగిలో పత్తి పంట అనుకూలం కానప్పటికీ రైతులు సుమారు 20 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. వానాకాలంలోనే పత్తి సాగుకు అనుకూలంగా ఉంటుంది.

– ఎస్.రఘుదీపిక, ఏఓ, జూలూరుపాడు

ప్రణాళికతో చదివితేనే ఉన్నత శిఖరాలకు..



సాంస్కృతిక కార్యక్రమంలో చిన్నారులు



బహుమతులు అందిస్తున్న ఎస్పీ వినీత్

పాల్వంచ: ప్రణాళికాయుతంగా చదివితేనే విద్యార్థులు అత్యున్నత శిఖరాలకు చేరుకునే అవకాశం ఉంటుందని ఎస్పీ వినీత్ అన్నారు. స్థానిక నవభారత్ పాఠశాల వార్షికోత్సవంలో ముగింపు కార్యక్రమం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు తమ నచ్చిన అంశాలపై మరింత దృష్టి సారించి అందులో సఫలీకృతం అయ్యేలా కృషి చేయాలన్నారు. చిన్నప్పటి నుండి సాంకేతిక విద్యపై దృష్టి సారించాలని, భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నవభారత్ జనరల్ మేనేజర్ వి.శ్రీనివాసరావు, చీఫ్ అడ్మినిస్ట్రేటర్ శ్యాంసుందర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి ప్రధానోపాధ్యాయురాలు పి.జ్యోతి, సమన్వయకర్త శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

సారా తయారీదారులపై బైండోవర్

జూలూరుపాడు: నాటు సారా తయారు చేస్తున్న వారిపై బుధవారం ఎక్సైజ్‌శాఖ పోలీసులు బైండోవర్ కేసు నమోదు చేశారు. వివరాలు.. సురారం గ్రామానికి చెందిన నలుగురు నాటు సారా తయారు చేస్తుండగా ఎక్సైజ్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. నాటు సారా తయారీదారులను జూలూరుపాడు తహసీల్దార్ శారద ఎదుట ఎక్సైజ్ పోలీసులు హాజరు పరిచగా, జరిమానా విధించి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై సాయికుమార్, హెడ్‌కానిస్టేబుల్ ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సూర్యం మృతి బాధాకరం



సూర్యంకు నివాళులర్పిస్తున్న కూనంనేని సాంబశివరావు తదితరులు

సుజాతనగర్: జర్నలిస్ట్ సూర్యం మృతి బాధాకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సర్వారం గ్రామ పంచాయతీ, ఒడ్డుగూడెంకు చెందిన జర్నలిస్టు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో బుధవారం వారి ఇంట్లో జరిగిన దశదిన కార్యక్రమానికి హాజరై సూర్యం చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న వయస్సులో మృతి చెందడం బాధాకరమన్నారు. పత్రికా రంగానికి, కమ్యూనిస్టు ఉద్యమాలకు సమప్రాధాన్యం ఇస్తూ నేటి తరానికి ఆదర్శంగా నిలిచాడన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, నాయకులు వాసిరెడ్డి మురళి, కొమారి హనుమంతరావు, కిలారు ప్రసాద్, కొమారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జేకే ఓసీ–5లో మైనింగ్ స్టాఫ్ ధర్నా



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఇల్లెందు: భూపాలపల్లిలోని కేఎల్‌పీ మైన్‌లో జరిగిన ఓ ప్రమాదానికి అక్కడి మైనింగ్ సర్దార్ సాదుల ప్రకాష్‌ను బాధ్యుడిగా చేస్తూ యాజమాన్యం అతన్ని సర్వీసు నుంచి డిస్మిస్ చేయటం దారుణమని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్ తెలిపారు. బుధవారం ధర్నాలో ఆయన మాట్లాడారు. ఇలాంటి చర్యల వల్ల మైనింగ్ స్టాఫ్ మనోధైర్యం కోల్పోతుందన్నారు. దురదృష్టవశాత్తు జరిగే ప్రమాదాలకు డిస్మిస్ చేయటం పరిష్కారం కాదన్నారు. ఒక ఉద్యోగి వెనుక అతని కుటుంబం ఉంటుందని, ఆ కుటుంబానికి మరణ శిక్ష వేసినట్లు అవుతుందని తెలిపారు. మానవతా దృక్పథంతో కంపెనీ పునరాలోచన చేయాలని కోరారు. అనంతరం అక్కడి అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బి.ప్రభాకర్, మేకల శంకర్ రావు, కుడితి శ్రీనివాస్, రాంచందర్, రమేష్‌బాబు, బుచ్చయ్య, రాజయ్య, లింకన్, వంశీ, నవీన్, వివేక్, ప్రవీణ్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ హామీతో దీక్ష విరమణ

ఇల్లెందురూరల్: మండలంలోని సీఎస్పీబస్తీ గ్రామ పంచాయతీ రాజీవ్‌నగర్‌తండా శివారులో గుడిసెలు వేసుకొని కనీస సౌకర్యాల కల్పన కోసం స్థానికులు వారం రోజులుగా తహసీల్ ఎదుట దీక్షలు కొనసాగించారు. అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో బుధవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఆందోళనకారుల వద్దకు వచ్చిన తహసీల్దార్ కృష్ణవేణి సీపీఎం నాయకులను తన చాంబర్‌లోకి పిలిపించి చర్చించారు. గుడిసెవాసుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించబడేలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో గుడిసెవాసులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో అబ్దుల్ నబీ, కృష్ణ, మోహన్, సుల్తానా, రాందాస్, వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి



టేకులపల్లి: గోలియాతండాలో భోగ్‌భండారోలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ, తదితరులు

బంజార గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి వేడుకలు బుధవారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. భోగ్ భండారోలో పూజలు నిర్వహించి ప్రసాదం స్వీకరించారు. పలువురు మాట్లాడుతూ.. బంజారాలు ఐక్యంగా తమ చట్టాలను కాపాడుకోవాలని, సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: పూజలో పాల్గొన్న నాయకులు



టేకులపల్లిలో నృత్యం చేస్తున్న బంజారా మహిళలు, నాయకులు



సేవాలాల్ జయంతి వేడుకల ఊరేగింపు



బంజారాల వంశావళి, చరిత్ర పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం



జూలూరుపాడు: వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..



చుంచుపల్లి: సంత్ సేవాలాల్ జయంతి వేడుకలో బీఎస్పీ నాయకులు



పాల్వంచ: పూజల్లో పాల్గొన్న కేటీపీఎస్ సీఈ, కమిషనర్

శివ ధ్యాన సంకీర్తనకు తరలిరండి



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

సుజాతనగర్: మహాశివరాత్రి సందర్భంగా స్థానిక శివాలయంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్వహించనున్న శివ ధ్యాన సంకీర్తన కార్యక్రమానికి అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరు కావాలని పిరమిడ్ సొసైటీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎస్.హనుమంతరావు తెలిపారు. సంబంధిత కరపత్రాలను బుధవారం శివాలయంలో విడుదల చేశారు. సొసైటీ వ్యవస్థాపకులు బ్రహ్మర్షి పితామహపత్రీజీ ఆశీస్సులతో ధ్యాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత జీవన విధానంలో ధ్యానం ప్రతివారికి అవసరమన్నారు. కార్యక్రమంలో చిట్టిబాబు, ప్రశాంతి, పార్వతి, భూదేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసేవలు పొందండి



మాట్లాడుతున్న కుమారస్వామి

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు ప్రభుత్వ జనరిక్ ఆస్పత్రిలో వైద్యా సౌకర్యాన్ని పొందాలని సూపరింటెండెంట్ కుమారస్వామి అన్నారు. బుధవారం కొత్తగూడెం శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం పింఛనర్స్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా సూపరింటెండెంట్ హాజరై మాట్లాడారు. సింగరేణి మాజీ ఉద్యోగి ఔషధ మొక్కల నిపుణులు అర్.వెంకటయ్య మాట్లాడుతూ.. ప్రకృతిలో లభించే మొక్కల ఔషధ గుణాలను వివరించారు. ఈ సందర్భంగా సామాజిక సేవలో భాగంగా ఏడుగురు పేద మహిళలకు ఒక్కొక్కరికి 5 కేజీల బియ్యం, ఒక చీర, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావు, అజరయ్య, ఎస్.ఆనంద్ కుమార్, డీఆర్.ప్రసాద్, కొత్తగూడెం శాఖ అధ్యక్షుడు ఎల్.రాములు, సంఘం సెక్రెటరీ భాస్కర్, చుంచుపల్లి ప్రెసిడెంట్ ఏ.పాపయ్య, వి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన మండలం బాధ్యత ఎమ్మెల్యేదే..



దీక్షలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

ఇల్లెందురూరల్: కొమరారంను నూతన మండలంగా, ఇల్లెందును రెవెన్యూ డివిజన్‌గా చేసేలా ప్రభుత్వాన్ని ఒప్పించాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యే బానోత్ హరిప్రియపై ఉందని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. కొమరారం గ్రామంలో కొమరారంను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ప్రజాపంథా ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 15వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పాలనలో ఇల్లెందును అంధకారంలోకి నెట్టివేసిందని విమర్శించారు. కొమరారంలో 15 రోజులుగా దీక్షలు చేపడుతున్నా స్థానిక ఎమ్మెల్యే దీక్షలను పట్టించుకోకపోవడం గర్హనీయం అన్నారు. నామమాత్రంగానే కొమరారం మండల ఏర్పాటు డిమాండ్‌ను అసెంబ్లీలో ప్రస్తావించారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వాన్ని ఒప్పించి ప్రజల ఆకాంక్ష మేరకు నూతన మండలం, రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రభుత్వ పాలనను స్తంభింపచేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాయల చంద్రశేఖర్, కెచ్చెల రంగారెడ్డి, చంద్ర అరుణ, నాయిని రాజు, ఆజ్మీర బిచ్చా, నాళి కృష్ణవేణి, మాచర్ల సత్యం, ఎదళ్లపల్లి సావిత్రి, శ్రీరాంకోటయ్య, సూర్నపాక రామ్మూర్తి, బుర్ర రాఘవులు, వీరన్న, శంకర్, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

పుల్వామా వీరులకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఇల్లెందు: 2019 ఫిబ్రవరి 14న పుల్వామాలో జరిగిన దాడిలో అమరులైన వీర జవాన్లకు వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం ఇల్లెందులో వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నేతలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నేతలు రాములోనియా, వేముల రాజేశ్వరరావు, సర్వేశం, నర్సింహారెడ్డి, అజయ్‌పాసీ, లక్ష్మన్‌పాసీ, సతీష్, సంజయ్, నవీన్, శివ, రజాక్, సాయి, దర్శు, వంశీ, భాను, వరుణ్, సాగర్, శ్రావణ్, సన్నీ, రాణా, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ ఎన్నిక



ఎన్నికైన అసోసియేషన్ సభ్యులు

ఇల్లెందు: సింగరేణి మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ ఎన్నిక బుధవారం ఇల్లెందులోని ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించారు. జనరల్‌బాడీ సమావేశంలో పలు విషయాలు చర్చించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.యాదగిరి, కార్యదర్శిగా మోహినుద్దీన్ భాషా, కోశాధికారిగా లచ్చిరాం, ఉపాధ్యక్షుడిగా ఈసం రాంబాబు, అనిల్ కుమార్, నరేష్, వీరన్న, మోహన్, రవికుమార్, స్వరూప రాణి ఎన్నికయ్యారు. సమావేశంలో గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు రంగనాథ్ పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

పాల్వంచ: ఈనెల 27న మోరంపల్లి బంజరలో జరగనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా జనరల్ బాడీ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా కోశాధికారి జక్కుల రాంబాబు, నాయకులు కుంజా కృష్ణ అన్నారు. బుధవారం స్థానిక నటరాజ్ సెంటర్‌లో సబ్ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల గురించి ప్రగల్భాలు పలికే ప్రభుత్వాలు బడ్జెట్ సమావేశాల్లో విస్మరించారన్నారు. రైతుల జీవన పరిస్థితులు మారడం లేదని, ఆదివాసీలను అడవుల నుంచి పంపించే ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో కుంజా భద్రు, వైఎస్ రెడ్డి, వీరమల్ల మల్లయ్య, నరసింహారావు, ఉమ పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

రోడ్డంతా గుంతలమయం

జూలూరుపాడు-చంద్రుగొండ రహదారి గుంతలమయంగా మారింది. 2016-2017లో 15 కిలోమీటర్ల ఈ సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించారు. అనంతరం గ్రామం వద్ద పాత కల్వర్టును తొలగించి కొత్త కల్వర్టు నిర్మించకపోవడంతో రహదారి గుంతలమయంగా మారి ప్రమాదకరంగా తయారైంది. ఈ రోడ్డు నిర్మాణానికి మంజూరైన నిధులు సరిపోకపోవడంతో కాంట్రాక్టర్ కల్వర్టు నిర్మించకుండా వదిలేశారు. దీంతో ప్రజలు, ద్విచక్రవాహనదారులు, బస్సు, లారీ, కారు, ఆటో, ట్రాలీ వాహనాదారుల రాకపోలకు ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - జూలూరుపాడు



ప్రశ్నించాల్సిన అధికారి : లఖన్ నాయక్, ఆర్అండ్‌బీ ఏఈ, జూలూరుపాడు
సెల్ నంబర్ : 9866309579